ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY



తూర్పుగోదావరి
16
శనివారం 7 ఏప్రిల్ 2018



● క్యాంపస్ కబుర్లు




విజ్ఞాన భాండాగారం..

# ఈ గ్రంథాలయం

**జేఎన్టీయూకే:** అక్కడ మౌస్ క్లిక్‌చేస్తే సమస్త సమాచారం కళ్లముందు ప్రత్యక్షమవుతుంది. అవసరమైన విషయాలు నూతన హంగులతో ఆన్‌లైన్ విధానంతో పరిశోధక విద్యార్థులు శోధించి సాధించే ఎన్నో అంశాలకు ప్రయోగశాలగా మారింది ఆ గ్రంథాలయం. అదే కాకినాడ జేఎన్టీయూలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సెంట్రల్ లైబ్రరీ. కిలోలకొద్దీ బరువుండే పుస్తకాలను మోసుకుంటూ వెళ్లాలంటే విద్యార్థులకు ఇబ్బందిగా ఉంటుంది. దానికి చెక్ పెడుతూ మారుతున్న కాలానికి తగ్గట్టుగా నూతన విషయాలను తెలుసుకుని విద్యార్థులకు బోధించేలా తమను తాము నిత్య విద్యార్థిగా భావించే అధ్యాపకులకు ఈ గ్రంథాలయం కార్యశాలగా మారింది. విశ్వవ్యాప్తంగా ప్రఖ్యాతి గాంచిన విలువైన జర్నల్స్, ఐఈఈఈ, అమెరికన్ సొసైటీ ఆఫ్ మెకానికల్ ఇంజనీరింగ్, యాక్సస్ ఇంజనీరింగ్, సైన్స్ డైరెక్ట్, ఐస్టం డిజిటల్ లైబ్రరీ, ఈబుక్స్‌తోపాటు పరిశోధనలకు ఉపయోగపడే పుస్తకాలు ఇక్కడ అందుబాటులో ఉన్నాయి.

- 1946లో ప్రారంభమైన జేఎన్టీయూకే డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సెంట్రల్ లైబ్రరీ
- విలువైన జర్నల్స్, డిజిటల్ లైబ్రరీలో ఈబుక్స్
- పరిశోధనలకు ఉపయోగపడే ఎన్నో పుస్తకాలు
- ప్రతి ఏడాది బడ్జెట్‌లో నిధులు కేటాయిస్తే మరింత అభివృద్ధి

### ● 106 పుస్తకాలతో ప్రారంభం

జేఎన్టీయూకే ఆవరణలో 1946లో 106 పుస్తకాలతో యూజీసీ ద్వారా గ్రంథాలయాన్ని ఏర్పాటు చేశారు. 2012, అక్టోబర్‌లో బీఆర్ అంబేద్కర్ సెంట్రల్ డిజిటల్ లైబ్రరీకి శంకుస్థాపన చేసి దాన్ని 2015లో ప్రారంభించారు. భవన నిర్మాణానికి కావాల్సిన పరికరాలకు రూ.10కోట్ల వరకూ అప్పట్లో నిధులు ఖర్చుచేశారు. ఈ గ్రంథాలయం యూజీ, పీజీ, పరిశోధక విద్యార్థులకు సమాచారాన్ని అందిస్తూ వారికి మార్గదర్శకంగా నిలిచింది. ఈ గ్రంథాలయం ప్రస్తుతం 4వేల మందికి వరకూ సేవలందిస్తోంది.

### ● అందుబాటులో 29 లక్షల పుస్తకాలు

ఈ-బుక్స్ ద్వారా 29 లక్షల పుస్తకాలను విద్యార్థులకు అందుబాటులో ఉంచారు. విలువైన పుస్తకాలను సేకరించి అంతర్జాలంలో పొందుపరిచారు. విద్యార్థులు తమకు అవసరమైన వాటిని ఎప్పుడైనా చదువుకునే వీలుంటుంది. వర్సిటీలోని ఆవరణలో ప్రతిచోట వైఫై ద్వారా సేవలను అందజేస్తున్నారు. ఈ విధానం ద్వారా వర్సిటీ ప్రాంగణంలో ఎక్కడున్నా తమకు కావాల్సిన పుస్తకాలను వైఫై ద్వారా చదువుకునేలా ఏర్పాట్లు చేశారు.



పరీక్షలకు సన్నద్ధమవుతున్న విద్యార్థులు

### ● 500కు పైగా పరిశోధనా గ్రంథాలు

సభ్యత్వం కలిగిన యూజీ, పీజీ పరిశోధక విద్యార్థులు, ప్రొఫెసర్‌లకు మాత్రమే దీనికి అనుమతిస్తారు. డిజిటల్ లైబ్రరీలో 500కు పైగా పరిశోధనా గ్రంథాలు అందుబాటులో ఉన్నాయి. అంతర్జాతీయంగా విద్యార్థులు చేసిన పరిశోధనా గ్రంథాలను సేకరించి అందుబాటులో ఉంచారు. ఏఎస్‌సీఈ, ఏఎస్ఎంఈ, ఏఎస్‌టీఎం డిజిటల్ లైబ్రరీల ద్వారా కూడా దీనిలో సేవలందిస్తున్నారు.




### ● ప్రొఫెసర్‌ల ప్రసంగాలు చూడొచ్చు

నేషనల్ డిజిటల్ లైబ్రరీ ఆఫ్ ఇండియా సభ్యత్వం కూడా ఈ గ్రంథాలయానికి ఉంది. 51వేల పుస్తకాలు, పరిశోధనలకు ఉపయోగపడే రిఫరెన్స్ పుస్తకాలు కూడా అందుబాటులో ఉన్నాయి. ఎన్‌పీటెల్ ద్వారా ఆన్‌లైన్‌లో కూడా ప్రముఖుల ఉపన్యాసాలను విద్యార్థులు వినవచ్చు. ఐఐటీ, ఐఐఎస్‌సీ లాంటి ప్రముఖ విద్యాసంస్థలకు చెందిన ప్రొఫెసర్‌ల ప్రసంగాలను కూడా వీడియో రూపంలో చూడొచ్చు. వైఫై ద్వారా యాక్సస్ చేసుకోవచ్చు.



### ● అనుబంధ కళాశాలలకు అనుసంధానించాలి



ప్రస్తుతం యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ కాకినాడ(యూసీఈకే)కు అనుబంధంగా ఉన్న ఈ గ్రంథాలయాన్ని జేఎన్టీయూకేకు అనుబంధంగా ఉన్న కళాశాలలకు అనుసంధానం చేస్తే విద్యార్థులకు మరింత ఉపయోగకరంగా ఉంటుంది. ప్రపంచవ్యాప్తంగా ప్రసిద్ధిచెందిన విశ్వవిద్యాలయాల గ్రంథాలయాలతో అవగాహనా ఒప్పందం కుదుర్చుకుంటే పరిశోధకులకు ప్రొఫెసర్‌లకు విలువైన సమాచారాన్ని సమకూర్చవచ్చు. గ్రంథాలయ పరిసరాలు పాఠకులను ఆకర్షించేలా ఉండేందుకు వర్సిటీ అధికారులు కృషి చేయాలి. సెంట్రల్ లైబ్రరీని జేఎన్టీయూకేకు అనుసంధానం చేసి హోదా కల్పించాలి. త్రి ఏడాది పుస్తకాలు కొనుగోలు చేసేందుకు నిధులు కేటాయించాలి. పోటీపరీక్షలకు ఉపయోగపడే కొన్ని పుస్తకాలు ఉన్నప్పటికీ మారుతున్న పరిజ్ఞానానికి తగిన విధంగా అప్‌డేట్ అయిన పుస్తకాలు సమకూర్చాల్సిన అవసరం ఉంది. దీన్ని శోద్‌గంగా ప్రాజెక్టుతో అనుసంధానం చేస్తే ఇక్కడ చేసిన పరిశోధనలు, పరిశోధక గ్రంథాలు వేరే విశ్వవిద్యాలయాల్లో పరిశోధనలు చేసేవారికి ఎంతో ఉపయోగకరం. ఈవిధంగా జరగాలంటే ఈ గ్రంథాలయం విశ్వవిద్యాలయ గ్రంథాలయంగా రూపుదిద్దుకోవాలి.

**-డాక్టర్ బీఆర్ దొరస్వామినాయక్, లైబ్రరీ సైన్సెస్ అసోషియేట్ ప్రొఫెసర్, యూసీఈకే**

### ● సివిల్స్‌కు ప్రిపేర్ అవుతున్నాను



ప్రతిరోజూ గ్రంథాలయానికి వచ్చి సివిల్స్ గేట్ పరీక్షలకు ప్రిపేర్ అవుతున్నాను. ఈ గ్రంథాలయంలో అన్నిపోటీ పరీక్షలకు ఉపయోగపడే పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి. విద్యార్థులు ప్రశాంతంగా చదువుకునేందుకు అన్నిరకాల వసతులు కల్పించారు.

**-పి.వెంకటరమణ, మెకానికల్ విద్యార్థి**